RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

RAJADHANI VOICE రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 284 | 5 శనివారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-




## చేదెక్కిన చక్కెర..

**రూ.70 నుండి రూ.80కు విక్రయం**

**- ప్రజల్లో తీవ్ర ఆందోళన**

**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబర్ 4 :** పండగ సీజన్‌లో భారీగా పెరుగుతున్న చక్కెర ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో కిలో ధర రూ.70 నుండి రూ.80కు చేరింది. ఇప్పటికే, ఉల్లి, మిరప ధరలు కన్నీరు పెట్టిస్తుంటే, చక్కెర ధర కూడా అదే బాట పడుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సెప్టెంబర్ 1న వెలువడిన మార్కెట్ వివరాల ప్రకారం, రాష్ట్రంలోని రిటైల్ మార్కెట్లలో కిలో చక్కెర ధర రూ.80కు పెరిగింది. ప్రభుత్వ గణాంకాల్లో ఈ ధరను 69 రూపాయలుగా వుంది. జూన్‌లో 45 రూపాయలు మాత్రమే ఉన్న ధర రెండు నెలల్లోనే ఏకంగా 30 రూపాయల వరకు పెరగడం గమనార్హం. ఇందుకు అనేక కారణాలను అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా దేశీయ చక్కెర ఉత్పత్తి అంచనాలు తగ్గడం ఒక కారణంగా భావిస్తున్నారు. ఇదే సమయంలో పండుగల సీజన్ నేపథ్యంలో డిమాండ్ పెరగడం, చెరకు పంటపై వాతావరణ పరిస్థితుల ప్రభావం కూడా ధరల పెరుగుదలకు కారణంగా భావిస్తున్నారు. ఇథనాల్ తయారీకి చెరుకును ఎక్కువగా వినియోగించడం కూడా చక్కెర ధరలు పెరగడానికి కారణంగా చెబుతున్నారు. కొరతను తీర్చడానికి విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని చెబుతున్న ప్పటికీ, బహిరంగ మార్కెట్‌లో దాని ప్రభావం పెద్దగా లేదని చెబుతున్నారు.

**నల్లబజారులోకి నిల్వలు** భారీ మొత్తంలో చక్కెర నల్లబజారులోకి వెళ్లిపోతున్నట్టు కూడా ఆరోపణలు వస్తున్నా యి. త్వరలోనే వినాయక చవితి ఉత్సవాలు రానుండడం, ఆ తరువాత దసరా, దీపావళి పండుగలు ఉండడంతో చక్కెర వినియోగం భారీగా పెరగనుంది. దీంతో ఇప్పటి నుంచే హోల్ సేల్ వర్తకులు బ్లాక్ మార్కెట్లోకి మళ్లిస్తున్నారని అంటున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి కూడా సమాచారం ఉందని, అయితే, ఇప్పటివరకు కఠిన చర్యలు ప్రారంభం కాలేదని అంటున్నారు.

## 7న ఆక్వా రైతుల ధర్నాకు ఎపి కౌలు రైతుల సంఘం మద్దతు

**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబర్ 4 :** రొయ్యల మేత ధరలు పెంపునకు వ్యతిరేకంగా ఏడవ తేదీన మత్స్య శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద అక్వా రైతులు తలపెట్టిన ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బి.బలరాం, ఎం.హరిబాబులు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రాష్ట్రంలో రొయ్యల మేత ధరలు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే బ్లాక్ టైగర్ రొయ్యల మేత రూ 24, వనామీ రొయ్యల మేత కిలో రూ.18 చొప్పున కంపెనీలు పెంచాయని, ముఖ్యమంత్రి సమక్షంలో రొయ్యల మేతల ధరలుపై జరిగిన చర్చల్లో అప్పెడా అనుమతి లేకుండా ధరలు పెంచ రాదని, పెరిగిన ధరలలో నాలుగు రూపాయల తగ్గించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో జరిగినటువంటి ఒప్పందాన్ని కూడా అమలు చేయలేని అసమర్ధ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందా అని అనుమానం కలుగుతుందని తెలిపారు. ఆగస్టు 31 వ తారీకున రొయ్యల మేత కంపెనీలు ఫీడ్ ధరలు పెంచుతున్నట్టు ప్రకటించాయని, పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కమిషనర్ ధరలు పెరగటం లేదని చెప్పి వివరణ ఇస్తూ అవన్నీ వాస్తవ దూరమని, ధరలు పెరగలేదంటూ పత్రికలలో ప్రకటనలు చేశారని, కానీ, కానీ వాస్తవంగా ధరలు పెరిగాయని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి, కమిషనర్ స్థాయి అధికారులు చెప్పేదానికి ఆచరణలో జరిగే దానికి పొంతన లేకుండా ఉందన్నారు. కంపెనీలకి ప్రభుత్వం అమ్ముడు పోయిందా అనే అనుమానం కలుగుతోందని చెప్పారు. ప్రభుత్వానికి రైతుల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అప్పుడ, రైతాంగం అనుమతి లేకుండా పెంచిన ఫీడ్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. గతంలో వేసిన కమిటీ పూర్తిస్తాయిలో చర్చలు జరిపి రైతుల అంగీకారమైన ధర మాత్రమే అమలు చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

## ట్రంప్ జాబితాలో మోదీకే అగ్రస్థానం

**- జీ20 సదస్సులో మోదీ-ట్రంప్ భేటీపై ఆసక్తి - త్వరలోనే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం - 500 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యంపై దృష్టి**

**- క్వాడ్, రక్షణ భాగస్వామ్యానికి మరింత బలం**



**వాషింగ్టన్, సెప్టెంబర్ 4 :** డిసెంబర్‌లో అమెరికాలో జరగనున్న జీ20 సదస్సు నేపథ్యంలో భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని అమెరికా రాయబారి సెర్గియో గోర్ వ్యాఖ్యానించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుళ దేశాల సమావేశంగా మాత్రమే కాకుండా, కీలక ద్వైపాక్షిక చర్చలకు కూడా వేదిక కానుందని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక, రక్షణ రంగాల్లో కొత్త నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని విశ్లేషించారు.ట్రంప్ దృష్టిలో మోదీ అత్యంత సన్నిహిత ప్రపంచ నాయకుల్లో ఒకరని గోర్ స్పష్టం చేశారు. జీ20 సమావేశానికి 35 మంది ప్రపంచ నేతలు హాజరైనా, వారిలో ఎవరిని ముందుగా కలవాలనుకుంటారని ▶▶2

## హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలన

**- హకీంపేట్‌లో సీఎం రేవంత్ పర్యటన - నిర్మాణాల నాణ్యతపై ప్రత్యేక ఆదేశాలు**

**- విద్యా సంస్థలు, ఆసుపత్రి భవనాల తనిఖీ - వర్షపు నీటి సంరక్షణకు ప్రణాళికలు**

**హకీంపేట్, సెప్టెంబర్ 4 :** రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వివిధ విద్యా సంస్థల నిర్మాణ పనులను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ అధికారులకు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని పేర్కొంటూ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లో భాగంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల, వెటర్నరీ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల భవనాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అలాగే 400 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఆసుపత్రి భవన సముదాయంతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, హాస్టళ్ల నిర్మాణాలను కూడా తనిఖీ చేశారు. ప్రతి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ▶▶2



## ఎన్టీఆర్ ఆశయాలను ఆచరణలోకి తెచ్చింది చంద్రబాబే: కాలవ శ్రీనివాసులు



**అనంతపురం, సెప్టెంబర్ 4 :**తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆశయాలను నిబద్ధతతో ఆచరణలోకి తీసుకొచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కొనియాడారు. అనంతపురంలో నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేదల సంక్షేమం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, ఆత్మగౌరవ పాలనే ధ్యేయంగా ఎన్టీఆర్ వేసిన పునాదులపైనే చంద్రబాబు నేడు సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యం చేస్తూ పరిపాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. తెలుగు జాతి వికాసం కోసం ఎన్టీఆర్ కన్న కలలను నెరవేర్చేందుకు చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన వ్యవస్థలను ప్రక్షాళన చేస్తూ, ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచేలా 'దీపం' పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, కొత్త పింఛన్ల మంజూరు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని వెల్లడించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు పునరంకితం అవుతూ, పార్టీ శ్రేణులంతా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

## గోదావరి కాలుష్యంపై ఆంధ్రా పేపర్ లిమిటెడ్‌కు డిప్యూటీ సీఎం హెచ్చరిక



**- గోదావరి కాలుష్యంలో ఆంధ్రా పేపర్ లిమిటెడ్ వాటా అధికమని వ్యాఖ్య**

**- రూ.21.34 కోట్ల పన్నులు బకాయిగా ఉన్నాయని ఆరోపణ**

**- కాలుష్య నియంత్రణ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం**

**- సమన్స్ జారీ చేసి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు**

**రాజధాని వాయిస్ రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 4 :** రాజమహేంద్రవరం గోదావరి నది కాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఆంధ్రా పేపర్ లిమిటెడ్ ఒకటిగా ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోపించారు. పరిశ్రమ భారీ స్థాయిలో వ్యర్థాలను విడుదల చేస్తూనే, స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన పన్నులను కూడా ఎగ్గొడుతోందని ఆయన విమర్శించారు. 2016 నుంచి కాతేరు గ్రామ పంచాయతీ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థ రూ.21.34 కోట్ల మేర పన్నులు బకాయిగా ఉంచిందని, నోటీసులు ఇచ్చిన ప్రతిసారీ కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రాజమహేంద్రవరం నగరంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ద్రవ వ్యర్థాల్లో దాదాపు సగం ఆంధ్రా పేపర్ లిమిటెడ్ నుంచే వస్తోందని పవన్ కళ్యాణ్ తెలిపారు. నగరంలో రోజుకు సుమారు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండగా, వాటిలో 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలను ఒక్క ఈ పరిశ్రమే విడుదల చేస్తోందని పేర్కొన్నారు. పరిశ్రమ విడుదల చేస్తున్న వ్యర్థాల్లో కాలుష్య కారకాల స్థాయిలు నిర్ణీత ప్రమాణాల కంటే అధికంగా ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్, ఫాస్ఫేట్, సల్ఫైడ్స్ వంటి కాలుష్య సూచికలు అనుమతించిన పరిమితులను మించాయని వివరించారు.పరిశ్రమ విడుదల చేస్తున్న వ్యర్థాల కారణంగా ▶▶2

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండు రోజుల పాటు కలెక్టర్ల కాన్ఫరెన్స్



**అమరావతి, సెప్టెంబర్ 4 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 8వ కలెక్టర్ల సదస్సు నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 10, 11వ తేదీల్లో ఈ సదస్సు జరగనుంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. తొలి రోజు గత సదస్సు నిర్ణయాల అమలుపై సమీక్షించనున్నారు.రాష్ట్ర ఆర్థిక వృద్ధి, జిల్లా వారీ లక్ష్యాలపై కలెక్టర్లు ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. స్వర్ణ ఆంధ్ర--2047 జిల్లా రోడ్‌మ్యాప్‌లపై ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించనున్నారు. ఆరోగ్యం, విద్యాశాఖ పనితీ రుపై కలెక్టర్లతో సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. పెట్టుబడులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడనున్నారు. జలధార కార్యక్రమం పురోగ తిపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.జిల్లా కలెక్టర్ల ఉత్తమ ఆవిష్కరణ లకు ప్రత్యేక ప్రదర్శన, వివరణ ఇవ్వనున్నారు. రెండో రోజు ఈ-గవర్నెన్స్, RTGS, PGRS పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. భూ పరిపాలన, కేంద్ర పథకాల నిధుల వినియోగంపై చర్చించనున్నారు. జిల్లా కలెక్టర్లతో ఓపెన్ ఫోరంలో క్షేత్రస్థాయి సమస్యలపై మాట్లాడనున్నారు. చివరి రోజు శాంతిభద్రతల సమీక్షతో పాటు సీఎం చంద్రబాబు చేయనున్నారు.

## అక్షరాస్యత గణాంకాలపై జగన్ ప్రశ్నలు

**- ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శ**

**- 82.1 శాతం అక్షరాస్యత రేటు ఎక్కడి నుంచి వచ్చిందని నిలదీత**

**- ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం**

**రాజధాని వాయిస్ తాడేపల్లి :** ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యత రేటుకు సంబంధించిన గణాం కాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్ రెడ్డి ఆరోపించారు. 2024లో 72.6 శాతంగా ఉన్న అక్షరాస్యత రేటు 2026లో 82.1 శాతానికి పెరిగిందని విద్యాశాఖ మంత్రి ప్రకటిం చడం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. ఇంకా 2026 సంవత్సరం పూర్తికాకముందే ఆ గణాంకా లు ఎలా వచ్చాయో ప్రభుత్వం ప్రజలకు వివరిం చాలని డిమాండ్ చేశారు. ▶▶2



## కేరళలో నారా లోకేశ్..

**అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం**



అమృతపురి : ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమం లో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమం లోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# అక్షరాస్యత గణాంకాలపై జగన్ ప్రశ్నలు

సోషల్ మీడియా వేదికగా స్పందించిన జగన్, కేంద్ర ప్రభుత్వ గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎన్ఎస్ఎస్ఓ నిర్వహించిన సర్వేల ఆధారంగా రూపొందిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదికలను ప్రస్తావించారు. జూన్ 2023 నుంచి జూన్ 2024 మధ్య నిర్వహించిన సర్వే ఆధారంగా రూపొందించిన 2023-24 వార్షిక నివేదిక ప్రకారం రాష్ట్రంలో 7 సంవత్సరాలు పైబడిన వారి అక్షరాస్యత రేటు 72.6 శాతంగా నమోదైందని పేర్కొన్నారు. 2018-19లో 69.1 శాతంగా ఉన్న ఈ రేటు క్రమంగా పెరిగి 72.6 శాతానికి చేరిందని వివరించారు. అలాగే, జనవరి 2025 నుంచి డిసెంబర్ 2025 మధ్య నిర్వహించిన సర్వే ఆధారంగా రూపొందించిన పీఎల్ఎఫ్ఎస్ క్యాలెండర్ ఇయర్ 2025 వార్షిక నివేదికను 2026 జూలై 2న విడుదల చేశారని జగన్ గుర్తు చేశారు. ఆ నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 7 సంవత్సరాలు పైబడిన వారి అక్షరాస్యత రేటు 71.4 శాతం మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఇలాంటి అధికారిక గణాంకాలు అందుబాటులో ఉన్నప్పటికీ 82.1 శాతం అక్షరాస్యత రేటు అంటూ ప్రభుత్వం ప్రచారం చేయడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం చెప్పిన గణాంకాలకు ఆధారాలు ఏమిటో వెల్లడించాలని జగన్ డిమాండ్ చేశారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. అధికారిక సంస్థలు విడుదల చేయని గణాంకాలను ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అయోమయం నెలకొనే ప్రమాదం ఉందన్నారు. విద్య వంటి కీలక రంగంలో ఖచ్చితమైన సమాచారం ఆధారంగానే విధానాలు, చర్చలు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.మరోవైపు ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై కూడా జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన యూడైస్‌ఈ గణాంకాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గుతుండగా, ప్రైవేట్ పాఠశాలల్లో నమోదు పెరుగుతోందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా రంగంలో మౌలిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన కూటమి ప్రభుత్వం ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని జగన్ విమర్శించారు. విద్యాశాఖ మంత్రి ఇతర రాజకీయ అంశాల కంటే తన శాఖ పనితీరుపై మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. రాష్ట్ర విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల విశ్వాసాన్ని పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు

# గోదావరి కాలుష్యంపై ఆంధ్రా పేపర్ లిమిటెడ్‌కు డిప్యూటీ సీఎం హెచ్చరిక



గోదావరి జలాల్లో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు ఏర్పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని, నీటి నాణ్యత తగ్గి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. దుర్గంధాలు వ్యాపించడం, భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం పెరగడం వంటి సమస్యలు కూడా ఉత్పన్నమ వుతున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన సమయంలో ఇచ్చిన సూచనలను సంస్థ పట్టించుకోలేదని ఆరోపించారు.కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, పరిశ్రమలకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుగా అవకాశం ఇచ్చిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. షోకాజ్ నోటీసులు జారీ చేసి తప్పులను సరిదిద్దుకునేందుకు సమయం కల్పించామని, గత మూడు నెలలుగా అధికారులు పలు మార్లు సంస్థ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పరిష్కార మార్గాలు సూచించారని తెలిపారు. అయినప్పటికీ సంస్థ నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని విమర్శించారు.ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెంటనే ఆంధ్రా పేపర్ లిమిటెడ్‌కు సమన్స్ జారీ చేసి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసర మైతే కార్యకలాపాల నిలిపివేత, జరిమానాలు, సీజ్ చర్యలు, లైసెన్స్ రద్దు వంటి చట్టపరమైన చర్యలను కూడా పరిశీలించాలని సూచించారు. కాలుష్య నియంత్రణకు సంబంధించిన కేసుల విచారణను వేగ వంతం చేయాలని అడ్వకేట్ జనరల్, అదనపు అడ్వకేట్ జనరల్‌తో పాటు ప్రభుత్వ న్యాయవా దులకు కూడా సూచనలు చేసినట్లు తెలిపారు. 'స్వచ్ఛ గోదావరి -- పవిత్ర పుష్కరాలు' లక్ష్యంగా ప్రభుత్వం గోదావరి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్యం, భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాలుష్య ంపై రాజీ పడబోమని హెచ్చరించారు. గోదావరి నదిని కాలుష్య రహితంగా ఉంచేందుకు పర్యావరణ వేత్తలు, పౌరసమాజం, ప్రజలందరూ ప్రభుత్వ చర్యలకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజా ప్రయోజ నాలు, పర్యావరణ పరిరక్షణ కూటమి ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యతలుగా కొనసాగుతాయని తెలిపారు.

# ట్రంప్ జాబితాలో మోదీకే అగ్రస్థానం



అడిగితే మోదీ పేరు అగ్రస్థానంలో ఉంటుందని తెలిపారు. 2020లో ట్రంప్ భారత్ పర్యటనను ఇప్పటికీ మధురస్మృతిగా గుర్తుచేసుకుంటున్నారని చెప్పారు. వచ్చే ఏడాది ట్రంప్ భారత్ పర్యటించే అవకాశాలు కూడా ఉన్నాయని సంకేతాలు ఇచ్చారు. ప్రపంచంలోని అనేక దేశాలు అసూయపడే స్థాయిలో భారత్-అమెరికా సంబంధాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా మధ్య ప్రతిష్ఠాత్మక వాణిజ్య ఒప్పందం కూడా త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని గోర్ వెల్లడించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు అనంతరం చర్చలు మళ్లీ ప్రారంభమయ్యాయని, ఒప్పందం పూర్తికి చాలా దగ్గర్లోనే ఉందని చెప్పారు. ప్రస్తుతం 240 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలనే లక్ష్యంతో మోదీ, ట్రంప్ ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఈ ఒప్పందం ఖరారయ్యే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు.భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ పేర్కొన్నారు. మోదీ నాయకత్వం దేశానికి స్థిరత్వాన్ని అందిస్తోందని ప్రశంసించారు. మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి అమెరికా దిగ్గజ సంస్థలు భారత్‌లో డేటా సెంటర్లు, కృత్రిమ మేధ కేంద్రాలు, ఔషధ రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. పెట్టుబడుల ప్రవాహం పెరగడం వల్ల రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలకు ప్రయోజనం చేకూరుతోందని అన్నారు. కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను అమెరికాకు ఆకర్షించడంలో కూడా రాయబార కార్యాలయం పాత్ర ఉందని చెప్పారు.

రక్షణ రంగంలో భారత్‌ను అత్యంత విశ్వసనీయ భాగస్వామిగా అమెరికా భావిస్తోందని గోర్ స్పష్టం చేశారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, ఇతర ఆధునిక రక్షణ వ్యవస్థలపై ఇరు దేశాలు చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కాకుండా పరస్పర విశ్వాసం, వ్యూహాత్మక సహకారంపై ఆధారపడి ఉన్నాయని చెప్పారు. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌తోనే అమెరికా ఎక్కువ సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందని వెల్లడించారు.భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన క్వాడ్ కూటమికి కూడా అమెరికా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని గోర్ తెలిపారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో క్వాడ్ దేశాల నేతల శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించేందుకు అమెరికా ఆసక్తి చూపుతోందన్నారు. వరుస ఉన్నతస్థాయి పర్యటనలు, వాణిజ్య ఒప్పందాలు, వ్యూహాత్మక భాగస్వామ్యాలతో భారత్-అమెరికా సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెట్టనున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# గుంటూరు బాలిక కిడ్నాప్ కేసు.. నిందితుడు జాన్ సైదా హర్యానాలో అరెస్ట్

**తీవ్ర కలకలం రేపిన గుంటూరు బాలిక కిడ్నాప్ కేసు**
**మూడు నెలలైనా బాలిక ఆచూకీ దొరక్కపోవడంపై హైకోర్టు ఆగ్రహం**
**పోలీసులకు అక్షింతలు!**
**దాంతో ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డీజీపీ**
**సాంకేతిక ఆధారాలతో నిందితుడి ఆచూకీ గుర్తింపు**

**రాజధాని వాయిస్ గుంటూరు, సెప్టెంబర్ 4 :** గుంటూరు బాలిక కిడ్నాప్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన షేక్ జాన్ సైదాను పోలీసులు హర్యానాలో అరెస్ట్ చేశారు. మూడు నెలలుగా బాలిక ఆచూకీ లభించకపోవడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో, పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిందితుడిని పట్టుకున్నారు.వివరాల్లోకి వెళితే, గుంటూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను షేక్ జాన్ సైదా (రబ్బానీ) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని, మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. తన కుమార్తె అపహరణకు గురైందని, ఆమెను తమకు అప్పగించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ బాలిక తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ తుహిన్ కుమార్ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. మూడు నెలలు గడిచినా బాలిక ఆచూకీ కనిపెట్టలేకపోవడం పోలీసుల వైఫల్యమేనని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఇలాంటి పోలీసులు ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటు" అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌ను పోలీస్ స్టేషన్‌లోకి రాకుండా అడ్డుకోవడంలో చూపిన శ్రద్ధ, బాలికను రక్షించడంలో ఎందుకు చూపలేకపోయారని న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది.ఈ కేసు దర్యాప్తులో స్థానిక పోలీసులపై తమకు నమ్మకం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం, బాలికను గురువారం కోర్టులో హాజరుపరచాలని నేరుగా ఏపీ డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇంత తీవ్రంగా స్పందించడంతో, డీజీపీ సిట్ నియామకం జరిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలోనే, సాంకేతిక ఆధారాలతో నిందితుడు జాన్ సైదా హర్యానాలో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని, బాలికను గుంటూరుకు తరలించే ప్రక్రియను పోలీసులు ప్రారంభించారు.

# తాగునీటికే ప్రాధాన్యత



**రాజధాని వాయిస్ హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** ప్రస్తుత పరిస్థితుల్లో కృష్ణానది నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చి వాడుకోవాలని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు తెలుగు రాష్ట్రాలకు సూచించింది. శుక్రవారం హైదరాద్ లో జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇఎన్‌సిల సమావేశంలో ఈ మేరకు బోర్డు సూచన చేసింది. ఈ సమావేశానికి కెఆర్‌ఎంబి చైర్మన్ సుబ్రాంగ్‌స్ బిస్వాస్ అధ్యక్షత వహించగా, సభ్య కార్యదర్శి సతీష్‌కుమార్ కంబోజ్ పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల వాదనలు విన్న తరువాత ఈ సూచనను బోర్డు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసమే జలాశయాల నుంచి నీటిని కిందకు విడుదల చేయడం సరికాదని పేర్కొంది. తాగునీటి అవసరాలను మాత్రమే రెండు రాష్ట్రాలు పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. ఉమ్మడి జలాశయాల్లో నీరు తక్కువగా ఉన్న నేపథ్యంలో పొదుపుగా వాడుకోవాలని, కష్టకాలంలో తాగునీటికే ప్రాధాన్యత ఇవ్వాలని విభజన చట్టం చెబుతున్నదని బోర్డు గుర్తుచేసింది. విద్యుత్ ఉత్పత్తి పేరిట తెలంగాణ నీటిని దిగువకు విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కెఆర్‌ఎంబి చేసిన సూచనలకు ప్రాధాన్యత లభించింది. అదే సమయంలో పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను సైతం నియంత్రించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సూచించింది. అయితే, ఈ సమావేశంలో అధికారికంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నెల నాల్గవవారంలో మరోసారి కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం పూర్తి స్థాయిలో నిర్వహించి నీటి వాటాల విషయంలో నిర్ణయం తీసుకోవాలని బోర్డు అధికారులు నిర్ణయించారు

**50 శాతం వాటా అడిగాం : తెలంగాణ ఇఎన్‌సి రమేశ్ బాబు**

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాల్లో ఇరు రాష్ట్రాలకు 50:50 వాటా ఇవ్వాలని డిమాండ్ చేశామని తెలంగాణ ఇఎన్‌సి రమేష్ బాబు తెలిపారు. కానీ ఎపి మాత్రం పాత పద్ధతి ప్రకారం 66:34 నిష్పత్తిలోనే పంపిణీ చేయాలని కోరిందని, ఈ పాత వాటాను తాము అంగీకరించడం లేదని చెప్పారు. పోతిరెడ్డిపాడుతో పాటు తాజాగా వెలిగొండ నుంచి కూడా ఎపి అక్రమంగా నీటిని తరలించడాన్ని బోర్డు దృష్టికి తీసుకెళ్లామన్నారు. మొత్తంగా తెలంగాణ 200 టిఎంసిలు, ఎపి 100 టిఎంసిల నీటిని కోరినట్లు తెలిపారు.

**అవసరం లేకున్నా విద్యుత్ ఉత్పత్తి : ఎపి ఇఎన్‌సి నరసింహమూర్తి**

కృష్ణా జలాలను పాత పద్ధతిలోనే 66:34 నిష్పత్తిలో పంపిణీ చేయాలని కృష్ణా బోర్డును డిమాండ్ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సి నరసింహమూర్తి తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి కోసం 50:50 వాటా ఇవ్వాలన్న తెలంగాణ డిమాండ్‌ను తాము వ్యతిరేకించామన్నారు. వచ్చే ఆగస్టు వరకు తమకు 104 టిఎంసిల నీరు కావాలని కోరగా, తెలంగాణ 200 టిఎంసిలు అడగడం సమంజ సం కాదన్నారు. అవసరం లేకున్నా తెలంగాణ శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని పేర్కొ న్నారు. తాము ఎవరి వాటానూ లాక్కోవడం లేదని, సొంత వాటా నుంచే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా నీటిని తీసుకుంటున్నామని చెప్పారు. రాయలసీమ, మార్కాపురం, పల్నాడు తదితర జిల్లాల తాగునీటి అవసరాల కోసమే ఈ నీటిని వాడుతున్నట్లు తెలిపారు.

# హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలన



ఎడ్యుకేషన్ హబ్‌లో జరుగుతున్న అన్ని నిర్మాణ పనులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ శాఖల అధికారులు సమిష్టిగా పనిచేస్తేనే ప్రాజెక్టు నిర్దేశిత గడువులో పూర్తవుతుందని పేర్కొన్నారు. సాంకేతిక అంశాలు, భద్రతా ప్రమాణాలు, నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రతి దశలో పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎడ్యుకేషన్ హబ్ పరిధిలో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని సేకరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. భవిష్యత్తులో నీటి వనరుల పరిరక్షణకు ఇది ఉపయోగపడటమే కాకుండా, ల్యాండ్‌స్కేపింగ్ పనులకు కూడా వర్షపు నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు.పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా హరితాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించేలా విశాలమైన పచ్చదనం, ఆధునిక మౌలిక సదుపాయాలు, సౌకర్యవంతమైన హాస్టల్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ఒకే వేదికగా హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాజెక్టుల పురోగతి, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌ను ఆదర్శవంతమైన విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## మెలోనీ రికార్డు.. ప్రధాని మోదీ శుభాకాంక్షలు



రెండో ప్రపంచ యుద్ధానంతరం సుదీర్ఘకాలం పదవిలో ఉన్న ఇటలీ ప్రధానిగా జార్జియా మెలోనీ రికార్డు నెలకొల్పారు. దీంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మెలోనీ నాయకత్వంపై ఇటలీ ప్రజలు ఉంచిన నమ్మకానికి ఇదే నిదర్శనమన్నారు. భారత్-ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యా న్ని మరింత బలోపేతం చేయడంలో ఆమె స్నేహం కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. ఇక ముందు కూడా ఆమె మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇరు దేశాల భవిష్యత్తు కోసం ఇటలీతో సన్నిహిత సహకారాన్ని కొనసాగించడానికి భారత్ ఎదురుచూస్తోందని పేర్కొన్నారు.

**మెలోనీ రికార్డు..**జార్జియా మెలోని ప్రభుత్వం ఇటలీ రాజకీయ చరిత్రలో ఒక అరుదైన రికార్డును నెలకొల్పింది. మెలోనీ 1,413 రోజుల పాటు నిరంతరాయంగా అధికారంలో కొనసాగి.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సుదీర్ఘకాలం పదవిలో ఉన్న ప్రధానిగా నిలిచారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసినప్పటి నుంచి అక్కడి ప్రభుత్వాలు సగటున 14 నెలలు మాత్రమే అధికారంలో ఉన్నాయి. గత 80ఏళ్లలో ఇటలీ 68 ప్రభుత్వాలను చూసింది. అందుకు మెలోని ప్రభుత్వం రాజకీయ సంక్షోభాలు లేకుండా 2022 నుంచి నిరంతరాయంగా అధికారంలో కొనసాగుతోంది.

# 300 సార్లు ఎన్నికల్లో పోటీ.. ఆ 'ధర్తీపకడ్' ఇక లేరు



ఆయన వ్యాపారవేత్త అయినప్పటికీ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటారు. ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు అండగా నిలిచేవారు. అయితే, ప్రజలను రాజకీయంగా చైతన్య పరచాలన్నది ఆయన ప్రయత్నం. ఇందుకోసం ఎన్నికల్లో పోటీ చేయడాన్ని ఓ మార్గంగా ఎంచుకొని దాదాపు 300 సార్లు పోటీ చేశారు. ఆయనే బిహార్‌కు చెందిన నాగర్మల్ బజోరియా స్థానికంగా 'ధర్తీ పకడ్'గా పేరు తెచ్చుకున్న ఈయన 97 ఏళ్ల వయసులో కన్నుమూశారు.బ్రిటిష్ ఇండియాలో లాహోర్‌లో (1930లో) జన్మించిన నాగర్మల్.. స్వాతంత్ర్యానికి ముందే బిహార్‌లోని భాగల్‌పుర్‌కు కుటుంబంతో వలస వచ్చారు. సామాజిక సేవలో ముందుండే ఆయన పేద అమ్మాయిలకు సామూహిక వివాహాలు జరిపించేవారు. సొంత ఖర్చులతో నీటి వనరులను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలతో స్థానికంగా 'ధర్తీ పకడ్'గా పేరు తెచ్చుకున్నారు. 30 ఏళ్ల వయసులో భాగల్‌పుర్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి తర్వాత వెనక్కి తిరిగి చూడలేదు. ఫలితమేదైనా సరే.. ఎన్నికల్లో పోటీ చేయడాన్ని జీవితంలో భాగంగా ఎంచుకున్నారు.స్థానిక సంస్థలు మొదలు రాష్ట్రపతి ఎన్నికల వరకు అనేక స్థానాల్లో నాగర్మల్ పోటీ చేశారు. ఇందిరా, రాజీవ్ గాంధీలతోపాటు వాజ్‌పేయీ, ఎల్‌కే ఆడ్వాణీ, ప్రణబ్ ముఖర్జీ వంటి దిగ్గజ నేతలకు పోటీగా నిలబడ్డారు. అంతేకాదు.. 1969లో రాష్ట్రపతి ఎన్నికల్లోనూ పోటీకి దిగారు. దాదాపు అన్ని ఎన్నికల్లోనూ ఓటమి చెందిన ఆయన సుమారు 300 సార్లు బరిలో నిలవడం విశేషం. కేవలం ఎన్నికల్లో పోటీ చేయడమే కాకుండా ప్రచారంలోనూ ప్రత్యేక శైలి కనబరిచేవారు. చేతిలో గంటను పట్టుకొని మోగిస్తూ ప్రచారం నిర్వహించేవారు. గాడిదలతో ర్యాలీ నిర్వహించడం, అవినీతికి వ్యతిరేకంగా జంతువుల మెడకు నినాదాలు రాయడం వంటి వినూత్న చర్యలతో స్థానికుల దృష్టిని ఆకర్షించే ప్రయత్నాలు చేశారు.

# ఈ-సిగరెట్ల దందాపై ఈగల్ ఫోర్స్ దాడులు.. ముగ్గురి అరెస్ట్..

**రాజధాని వాయిస్ హైదరాబాద్, సెప్టెంబరు 4:** నగరంలోని మాదాపూర్‌లో జోరుగా సాగుతున్న నిషేధిత ఈ-సిగరెట్ల దందాపై ఈగల్ ఫోర్స్ పంజా విసిరింది. ఈ-సిగరెట్స్ విక్రయదారులపై ఆకస్మిక దాడులు చేసింది. వారి నుంచి 152 నిషేధిత ఈ-సిగరెట్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసింది. ఈ దాడిలో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేయగా, ఇద్దరు యజమానులు పరారీలో ఉన్నారు. ఈ- సిగరెట్ల నిల్వ, అక్రమరవాణా, విక్రయాలపై ఈగల్ ఫోర్స్ దృష్టి సారించింది. నిషేధిత ఈ-సిగరెట్ల(వేప్స్)విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం అందుకున్న పోలీసులు మాదాపూర్‌లోని రెండు ఔట్‌లెట్లపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 152 నిషేధిత ఈ-సిగరెట్లను పోలీసులు సీజ్ చేశారు. వారి నుంచి 34 ఫారిన్ సిగరెట్ ప్యాకెట్లు, 3 స్కానర్లు, రూ.9,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నిషేధిత సిగరెట్లు(వేప్స్)విక్రయాలు వెబ్‌సైట్ ద్వారా నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వాట్సప్ ద్వారా ఆర్డర్లు తీసుకుని పోర్టర్, రాపిడో ద్వారా డెలివరీ చేస్తున్నట్లు వారు తెలిపారు. వీటి చెల్లింపులు క్యూఆర్ కోడ్‌ల ద్వారా జరిగినట్లు వారు గుర్తించారు. నిందితులకు చెందిన రెండు బ్యాంకు ఖాతాల్లో రూ.2.31 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ లావాదేవీలను పరిశీలించిన పోలీసులు హైదరాబా ద్‌లో 130 మంది ఈ-సిగరెట్ల వినియోగదారులు ఉన్నట్లు, 351 మంది కొనుగోలుదారులు ఉన్నట్లు గుర్తించారు. ఈ-సిగరెట్లను కొనుగోలు చేయడం కూడా చట్టప్రకారం నేరమే అవుతుందని, వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. సాధారణ సిగరెట్లలో నికోటిన్ పొగాకు రూపంలో ఉండగా, ఈ-సిగరెట్లలో నికోటిన్, కొన్ని రసాయనాల మిశ్రమం ద్రవ రూపంలో ఉంటుంది. సాధారణ సిగరెట్లను కాల్చినపుడు పొగ వస్తుంది. కానీ, ఈ-సిగరెట్లను కాల్చడం ఉండదు. ఇవి బ్యాటరీతో పనిచేసే ఎలక్ట్రానిక్ పరికరాలు. ఇవి రసాయన ద్రవాన్ని వేడి చేసి ఆవిరిగా మారుస్తాయి. ఈ నికోటిన్ ఆవిరిని వినియోగదారులు పీల్చుతారు. ఇవి చూడడానికి పెన్ను మాదిరిగా ఉంటాయి. అందుకే వీటిని వేప్స్ లేదా వేప్స్ పెన్నులు (ఆవిరి పెన్నులు) అంటారు.

# గురజాలకు రూ.18.62 కోట్ల అమృత్ 2.0 తాగునీటి ప్రాజెక్టు

- గురజాలలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- నాగార్జునసాగర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా
- ప్రతి ఇంటికి 24 గంటల స్వచ్ఛమైన తాగునీరు లక్ష్యం
- ఎమ్మెల్యే యరపతినేనితో కలిసి శంకుస్థాపన చేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు





**రాజధాని వాయిస్ గురజాల :** గురజాల నగర పంచాయతీ పరిధిలో ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తాగునీటి సమస్య పరిష్కారానికి కీలకమైన అడుగు పడింది. రూ.18.62 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న అమృత్ 2.0 తాగునీటి ప్రాజెక్టు పనులకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన వారు, గురజాల పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అమృత్ 2.0 పథకం కింద రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని గురజాలకు తరలించనున్నారు. పట్టణంలోని ప్రతి ఇంటికి రోజులో 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించామని అధికారులు వివరించారు. పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల తాగునీటి కొరత సమస్య పూర్తిగా తొలగిపోవడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.ఎన్నికల సమయంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రధాన సమస్యల్లో తాగునీరు, సాగునీటి అవసరాలు ముఖ్యమైనవని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు గుర్తు చేశారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చే ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. గురజాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అభివృద్ధి అంతరాన్ని తగ్గించేందుకు అనేక ప్రాజెక్టులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజలకు మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.గురజాల పట్టణం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణ ప్రజల ఎన్నో ఏళ్ల కల అయిన సమగ్ర తాగునీటి ప్రాజెక్టు ఇప్పుడు సాకారమవుతోందని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదన్నారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రాజెక్టు పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పనుల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురజాల పట్టణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని, భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడే శాశ్వత ఆస్తిగా నిలవనుందని కార్యక్రమంలో పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# తిరుమలలో భక్తిశ్రద్ధలతో గోకులాష్టమి వేడుకలు





**రాజధాని వాయిస్ తిరుమల :** తిరుమలలో గోకులాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గోగర్భం డ్యామ్ సమీపంలోని ఉద్యానవనంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించారు. కాళీయమర్ధనుడైన శ్రీకృష్ణస్వామివారికి వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపి, పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదారతో పంచాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడా యి. పంచాభిషేకాల అనంతరం శ్రీకృష్ణస్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక హారతులు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోవింద నామస్మరణల మధ్య స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు శ్రీకృష్ణుని అవతార విశిష్టతను వివరిస్తూ ప్రత్యేక శ్లోకాలు, స్తోత్రాలను పారాయణం చేశారు. కార్యక్రమమంతా భక్తిరసపూరిత వాతావరణంలో సాగింది .గోకులాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్లోత్సవం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన ఉట్టిని యువకులు, భక్తులు ఉత్సాహంగా కొట్టేందుకు ప్రయత్నించగా సందడి నెలకొంది. చిన్నారులు కృష్ణుడు, రాధ వేషధారణలో పాల్గొని వేడుకలకు మరింత ఆకర్షణ తీసుకొచ్చారు. భక్తుల హర్షధ్వానాల మధ్య ఉట్లోత్సవం విజయవంతంగా నిర్వహించారు. వేడుకలకు హాజరైన భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. పులిహోర, చక్కెర పొంగలి, లడ్డూ తదితర ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ప్రసాద స్వీకరణ కోసం భక్తులు క్రమశిక్షణతో వరుసల్లో నిలబడి పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.గోకులాష్టమి సందర్భంగా తిరుమల లో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఉద్యానవన ప్రాంతాన్ని రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిది ద్దారు. శ్రీకృష్ణుని జీవిత విశేషాలను ప్రతిబింబించే అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు, కుటుంబాలతో వచ్చిన భక్తులు ఈ వేడుకలను ఆసక్తిగా వీక్షించారు. ప్రపంచ శాంతి, ప్రజల ఆయురారోగ్యాలు, సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. గోకులాష్టమి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందినట్లు పేర్కొన్నారు. శ్రీకృష్ణుని ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షిస్తూ తిరుమలలో గోకులాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి.

# టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు రూ.15 లక్షల బీమా చెక్కుల పంపిణీ

**రాజధాని వాయిస్ గుడివాడ :** కష్టకాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన ముగ్గురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు సభ్యత్వ బీమా పథకం కింద మంజూరైన రూ.15 లక్షల చెక్కులను శుక్రవారం గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో పంపిణీ చేశారు. కూటమి నాయకులతో కలిసి బాధిత కుటుంబాలకు బీమా సాయం అందజేస్తూ వారికి ధైర్యం చెప్పారు. గుడ్లవల్లేరుకు చెందిన గుమ్మడి శ్రావణి కుటుంబానికి, అంగులూరుకు చెందిన చింతా విజయలక్ష్మి కుటుంబానికి, వడ్లమన్నాడుకు చెందిన కొనతం శ్రీరామమూర్తి కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున బీమా చెక్కులు అందజేశారు. మొత్తం రూ.15 లక్షల ఆర్థిక సాయాన్ని సభ్యత్వ బీమా పథకం ద్వారా బాధిత కుటుంబాలకు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సాయం వారి కుటుంబాలకు కొంత భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన క్లిష్ట సమయంలో బీమా సాయం అందించడం ఎంతో ఉపశమనం కలిగించిందన్నారు. సభ్యత్వ బీమా ద్వారా ఆర్థికంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం తమ కుటుంబాలకు భవిష్యత్తుపై కొంత నమ్మకాన్ని కల్పించిందని పేర్కొన్నారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి వెన్నెముక అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్త సంక్షేమం తమకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కార్యకర్తలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవాలన్నదే పార్టీ అధిష్ఠానం లక్ష్యమని చెప్పారు. అందుకే సభ్యత్వ బీమా వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు అవసరమైన సమయంలో సహాయం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తల పాత్రను ఎప్పటికీ మరువబోమన్నారు. భవిష్యత్తులో కూడా బాధిత కుటుంబాలకు అవసరమైన సహకారం అందించేందుకు పార్టీ, ప్రభుత్వ పరంగా తనవంతు కృషి కొనసాగుతుందని వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు.

# ఉత్తరాంధ్ర జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక

- విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్
- రాబోయే మూడు గంటల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు
- గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన అధికారులు



**రాజధాని వాయిస్ అమరావతి :** ఉత్తరాంధ్ర జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పిడుగుపాటు హెచ్చరిక జారీ చేసింది. రాబోయే మూడు గంటల పాటు విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అవసరం లేకుండా బయటకు వెళ్లొద్దని హెచ్చరించింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఆయా జిల్లాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశముంది. తీర ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, గ్రామీణ మండలాల్లో ప్రభావం మరింత ఎక్కువగా ఉండవచ్చని అధికారులు తెలిపారు. రైతులు, కూలీలు, మత్స్యకారులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిడుగుల సమయంలో పొలాల్లో లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని హెచ్చరించారు.గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని అధికారులు వెల్లడించారు. ఈదురుగాలుల ప్రభావంతో చెట్ల కొమ్మలు విరిగిపడటం, విద్యుత్ తీగలు దెబ్బతినడం, హోర్డింగులు కూలిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వాహనదారులు ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా జాతీయ రహదారులు, కొండ ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. పిడుగుపాటు ప్రమాదం అధికంగా ఉండటంతో చెట్ల కింద నిలబడరాదని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఓపెన్ ప్రదేశాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షం ప్రారంభమైన వెంటనే సమీపంలోని సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలని కోరారు. మొబైల్ ఫోన్ల వినియోగం, విద్యుత్ పరికరాల వినియోగంలోనూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులు కోతకు సిద్ధంగా ఉన్న పంటలను భద్రపరచుకోవాలని, వ్యవసాయ పరికరాలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. పశువులను కూడా బహిరంగ ప్రదేశాల్లో ఉంచకుండా షెడ్లలో కట్టివేయాలని కోరారు. వర్షం, గాలుల ప్రభావంతో పంటలకు నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది. ప్రజలు అధికారిక హెచ్చరికలను మాత్రమే నమ్మాలని, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికారులను సంప్రదించాలని సూచించింది. రాబోయే కొన్ని గంటలు అత్యంత కీలకమైనవిగా భావించి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# సర్వేపల్లి కాలువ కట్ట వాసుల 60 ఏళ్ల కల సాకారం

- 1,215 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం
- ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం
- మంత్రి నారాయణ చొరవతో ముందుకు వచ్చిన కీలక నిర్ణయం
- త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాల పంపిణీ



**రాజధాని వాయిస్** నెల్లూరు, సెప్టెంబర్ 4 : నెల్లూరు నగరంలోని సర్వేపల్లి కాలువ కట్టపై నివసిస్తున్న వేలాది నిరుపేద కుటుంబాల చిరకాల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. దాదాపు ఆరు దశాబ్దాలుగా చట్టబద్ధమైన హక్కులు లేకుండా జీవనం సాగిస్తున్న 1,215 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మంత్రివర్గం ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలపడంతో సొంతింటి హక్కు కోసం ఎదురుచూస్తున్న పేదల ఆశలు ఫలించాయి. సర్వేపల్లి కాలువ కట్ట ప్రాంతంలో గత 60 ఏళ్లుగా అనేక కుటుంబాలు నివాసం ఉంటున్నప్పటికీ, వారు ఆక్రమిస్తున్న భూములు కాలువ పోరంబోకు పరిధిలో ఉండటంతో అధికారిక యాజమాన్య హక్కులు కల్పించడం సాధ్యం కాలేదు. దీంతో ఎప్పుడు ఖాళీ చేయిస్తారోనన్న భయాందోళనల మధ్య ప్రజలు జీవనం కొనసాగించారు. గత ప్రభుత్వాలు పలుమార్లు హామీలు ఇచ్చినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలే దు.ఈ నేపథ్యంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. కాలువ కట్ట వాసుల ఇబ్బందులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వివరించి, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భగత్‌సింగ్ కాలనీ సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యల మాదిరిగానే ఈ అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంది. తాజా కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించి, మొత్తం 62.70 ఎకరాల భూమిలో 22.31 ఎకరాలను కెనాల్ పోరంబోకు నుంచి 'ఏడబ్ల్యూ డ్రై'గా వర్గీకరణ మార్చేందుకు ఆమోదం తెలిపారు. కాలువ నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలగకుండా సాంకేతిక అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు. దీంతో సంబంధిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు జారీ చేయడానికి మార్గం సుగమమైంది.ఈ నిర్ణయంపై మంత్రి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న పేదల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్వీకరించి పరిష్కరించారని పేర్కొన్నారు. పేదల జీవితాల్లో భద్రత, స్థిరత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. త్వరలోనే లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర కేబినెట్ నిర్ణయంతో సర్వేపల్లి కాలువ కట్ట వాసుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నో ఏళ్లుగా తమ సొంత ఇంటిపై చట్టబద్ధమైన హక్కు కోసం ఎదురుచూసిన కుటుంబాలు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. తమ చిరకాల స్వప్నాన్ని సాకారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణలకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేస్తూ సంబరాలు జరుపుకుం టున్నారు.

# నిర్మానుష్య ప్రాంతాల్లో బాపట్ల పోలీసుల ప్రత్యేక తనిఖీలు

- ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాలతో విస్తృత తనిఖీ కార్యక్రమం
- పాడుబడిన భవనాలు, అనుమానాస్పద ప్రదేశాలపై నిఘా
- నేరాల నివారణే లక్ష్యంగా పోలీసుల చర్యలు



**రాజధాని వాయిస్ బాపట్ల, సెప్టెంబర్ 4 :** జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా పోలీసులు నిర్మానుష్య ప్రాంతాలు, పాడుబడిన భవనాలు, అనుమానాస్పద ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ లక్ష్యంగా ఈ తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రజలు రాకపోక లు తక్కువగా ఉండే ప్రాంతాలు, నిరుపయోగంగా ఉన్న భవనాలు, ఖాళీ స్థలాలు, ఇతర అనుమానాస్పద ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు అవకాశమున్న ప్రదేశాలను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమానా స్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని స్థానికులకు సూచించారు. జిల్లాలో నేరాల నివారణ కోసం ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పాడుబడిన భవనాలు, నిర్మానుష్య ప్రాంతాలను కొందరు అసాంఘిక శక్తులు దుర్వినియోగం చేసే అవకాశాలు ఉన్నందు న వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. తనిఖీల సందర్భంగా అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించి అవసరమైన చోట విచారణ చేపట్టారు. భద్రతా పరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక పరిస్థితులను సమీక్షించారు. ముఖ్య ప్రాంతాల్లో రాత్రి పూట గస్తీని మరింత ముమ్మరం చేయాలని పోలీసు అధికారులకు సూచనలు జారీ చేశారు.ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని పోలీసులు తెలిపారు. తమ పరిసరాల్లో అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీసు శాఖ అందుబాటులో ఉన్న సహాయ కేంద్రాలు, అత్యవసర సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు బాపట్ల జిల్లా పోలీసులు కట్టుబడి ఉన్నారని అధికారులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజల భద్రత, ప్రశాంత వాతావరణ పరిరక్షణ కోసం పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

# న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



మాచర్ల. సెప్టెంబర్ 04 రాజధాని వాయిస్ : అలుగురాజుపల్లిలోని న్యూటన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహిం చిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.ప్రధానంగా ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, సందడిగా ఉట్టి కొట్టి శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. విద్యార్థుల ఉత్సాహం, కేరింతలతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జున్నా శ్రీనివాసరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ జున్నా చక్రధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. ఎస్. నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ బి. నరసింహారావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఖాసిం వివిధ విభాగాల హెచ్ఓడిలు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాలలో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సంప్రదాయాలు, సంస్కృతి పట్ల అవగాహన పెంపొందుతుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

# పిన్నెల్లిని సత్కరించిన మహిళా విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగమణి



మాచర్ల.సెప్టెంబర్ 04 రాజధాని వాయిస్: పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్గా నూతనంగా నియమితులైన అదిరాల నాగమణి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ బలోపేతానికి చురుగ్గా పనిచేయాలని సూచించగా, పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మహిళల పక్షాన చిత్తశుద్ధితో పనిచేస్తానని నాగమణి పేర్కొన్నారు.

# సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా పూజలు



వినుకొండ.సెప్టెంబర్ 04రాజధాని వాయిస్ :శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గల శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడు ఫిరోజ్ బాషాకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు



పిడుగురాళ్ల.సెప్టెంబర్ 04రాజధాని వాయిస్ :తుమ్మల చెరువు ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ షేక్ ఫిరోజ్ బాషా 2026 పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. సెప్టెంబర్ 5న నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్లో జరిగే గురుపూజోత్సవంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ కృతికా శుక్లా, డీఈవో రామారావు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకోనున్నారు. గత 15 ఏళ్లుగా విద్యార్థుల చేతిరాతను తీర్చిదిద్దుతూ, నాణ్యమైన విద్యనందిస్తున్న ఫిరోజ్ బాషాను గతంలో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా ప్రశంసించగా, నాట్స్ సంస్థ కూడా సత్కరించింది. ఈ పురస్కారానికి ఎంపికైన ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

# తాళ్లపల్లిలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

## సేవా కార్యకర్తలకు మండవ చారిటబుల్ ట్రస్ట్ సత్కారం







మాచర్ల.రాజధాని వాయిస్ : సెప్టెంబర్ 04మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మండవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా తాళ్లపల్లి, కారంపూడి, ముటుకూరు, మాచర్ల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పండుగను జరుపుకున్నారు. తొలుత స్థానిక సీతారామ లక్ష్మణ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించి, భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి నామస్మరణ చేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ అధినేత మండవ రవి మాట్లాడుతూ, సమాజంలో ధర్మ పరిరక్షణకు శ్రీకృష్ణుని బోధనలు మార్గదర్శకమని పేర్కొన్నారు. అనంతరం సమాజ సేవలో నిస్వార్థంగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ వారిని శాలువాలతో ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామ నడిబొడ్డున యువతీ యువకుల కేరింతల మధ్య ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించి, భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో బీసీవై పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు, జింకల నాగేశ్వరరావు, యర్రగొర్ల సాంబశివరావు, యర్రగొర్ల కృష్ణాంజనేయులు, గ్రామ పెద్దలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుపతిలో ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు

- ఇస్కాన్ దేవాలయం పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు
- భక్తుల సౌకర్యార్థం వాహనాల మళ్లింపు
- సజావు రాకపోకల కోసం పోలీసుల ప్రత్యేక బందోబస్తు





**రాజధాని వాయిస్ తిరుపతి, సెప్టెంబర్ 4 :** తిరుపతిలోని ఇస్కాన్ దేవాల యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టారు. వేలాదిగా తరలివస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగేందుకు ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపు చర్యలను అమలు చేస్తున్నారు. జన్మాష్టమి వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉండటంతో ఇస్కాన్ ఆలయం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కీలక కూడళ్ల వద్ద అదనపు పోలీసు సిబ్బందిని నియమించారు. వాహనదారులు నిర్ణయించిన ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని సూచించారు.ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకునే విధంగా తగిన మార్గదర్శకాలను ఏర్పాటు చేశారు. భక్తులు ట్రాఫిక్ నియమాలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రత్యేక ట్రాఫిక్ మళ్లింపుల కారణంగా కొన్ని మార్గాల్లో వాహనాల సంచారంపై తాత్కాలిక ఆంక్షలు అమలులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. అత్యవసర సేవలు, ప్రజా రవాణాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.వేడుకల సందర్భంగా భక్తుల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు ప్రత్యేక భద్రతా బృందాలను మోహరించారు. అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పోలీసులు తెలిపారు. భక్తులు ట్రాఫిక్ మళ్లింపులు, పోలీసుల సూచనలను పాటించడం ద్వారా వేడుకలు సజావుగా సాగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# నిడదవోలులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

- ప్రహరీ గోడ, నూతన డ్రైనేజీ నిర్మాణాలకు శ్రీకారం
- రూ.47 లక్షలతో మౌలిక వసతుల అభివృద్ధి
- పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యమన్న మంత్రి





**రాజధాని వాయిస్ : నిడదవోలు :** నిడదవోలు పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో అడుగు పడింది. పట్టణంలోని 17వ వార్డులోని సుబ్బరాజుపేట పార్కు వద్ద ఎస్సీ ఎస్పీ నిధుల ద్వారా చేపట్టనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన సౌకర్యా లు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. సుబ్బరాజుపేట పార్కు వద్ద సుమారు రూ.30 లక్షల అంచనా వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులు పూర్తయిన తర్వాత పార్కు భద్రత మెరుగుపడటంతో పాటు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. పట్టణంలో ఉన్న ప్రజా వనరులను పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.అనంతరం చెట్టేవారి వీధి, మరపట్లవారి వీధిలో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.17 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రైనేజీ సమస్యల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులకు ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి అన్నారు. నూతన డ్రైనేజీ వ్యవస్థ ద్వారా మురుగునీటి సమస్యలు తగ్గి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.నిడదవోలు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయి స్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులను స్వాగతించారు. పట్టణంలో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన జీవన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

# అడిగొప్పులలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ 16 బైకులు సీజ్



దుర్గి.సెప్టెంబర్ 04రాజధాని వాయిస్ : జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని అడిగొప్పుల గ్రామం ఎస్సీ కాలనీలో గురజాల డీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కాలనీలోని పలు అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు, స్థానికుల వాహనాల ధ్రువపత్రాలను నిశితంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలతో పాటు 4 గడ్డపారలను పోలీసులు స్వాధీనం చేసుకుని, వాహనాలకు ఈ-చలాన్లు విధించారు.కారంపూడి సీఐ ఆవుల భాస్కర్, మాచర్ల రూరల్ సీఐ ఎస్. వేణు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రత కోసమే ఇటువంటి ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ, నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# కాసు మహేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మిట్టా



పిడుగురాళ్ల.సెప్టెంబర్ 04రాజధాని వాయిస్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా పబ్లిసిటీ వింగ్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన మిట్టా జంగమయ్య, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు, కాసు మహేష్ రెడ్డి సహకారంతో ఈ బాధ్యత దక్కినందుకు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు శివ యాదవ్, కోటేశ్వరరావు, మట్టారెడ్డి బాలకోటేశ్వరరావు, వై.వెంకటేశ్వర్లు, జె.కొండలు, మిట్టా అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# దాచేపల్లిలో జనాకర్షణ దినపత్రిక ఆవిష్కరణ



దాచేపల్లి.సెప్టెంబర్ 04 రాజధాని వాయిస్ :దాచేపల్లిలో జనాకర్షణ తెలుగు దినపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా జనాకర్షణ దినపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని, నిజ నిర్ధారణతో కూడిన వార్తలతో ముందుకు సాగాలని ఎంపీ, ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనాకర్షణ పత్రిక ఎడిటర్ కురియాల ఉదయభాస్కర్, అక్షర కృష్ణ పత్రిక ఎడిటర్ పగడాల నాగేశ్వరరావు, జనాకర్షణ పత్రిక జిల్లా బ్యూరో ఖమ్మం పాటి సాంబశివరావు, జనాకర్షణ పత్రిక రిపోర్టర్లు, ఇన్ఛార్జీలు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి ఎమ్మెల్యే ఏం ఏం కొండయ్య



చీరాల సెప్టెంబర్ 04 రాజధాని వాయిస్ : పట్టణంలోని 26వ వార్డు విటల్ నగర్లో మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద నిర్వహించిన పొంగళ్ల కార్యక్రమ ంలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా జాండ్రపేట వాసవినగర్ కాలనీలోని శ్రీకృష్ణ మంది రంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాలకొండయ్య, శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమాల్లో స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com